క్లుప్తంగా

రుణాలను రెన్యువల్ చేసుకోవాలి



పీఏసీఎస్ అధ్యక్షుడు చిన్నారావు

లావేరు: లావేరు పీఏసీఎస్ ద్వారా వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు ఈ నెల 23లోగా రెన్యువల్ చేయించుకోవాలని అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, సీఈఓ మీసాల సత్యనారాయణ అన్నారు. లావేరు పీఏసీఎస్ కార్యాలయంలో ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 23లోగా రుణాలు రెన్యువల్ చేయించుకుంటే 4 శాతం మాత్రమే వడ్డీ వర్తిస్తుందన్నారు. లేకపోతే 14 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సకాలంలో రుణాలు చెల్లించి వడ్డీ రాయితీ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వన్‌బీ, ఆధార్ కార్డు తీసుకొని లావేరు పీఏసీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

21న దూసి ధర్మారావు జయంతి

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ వక్త, కవి, మాజీ ఇంటాక్ కన్వీనర్ దూసి ధర్మారావు 73వ జయంతి ఉత్సవం ఈ నెల 21న శ్రీకాకుళం అనురాగ నిలయంలో సాయంత్రం 5గంటలకు నిర్వహించనున్నట్లు తరిణీకృష్ణ స్మారక ధార్మిక ట్రస్టు నిర్వాహకులు మండ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మారావు రచించిన పలు లలిత గీతాల సంగీత సుధార్ణవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభిమానులంతా హాజరు కావాలని కోరారు.

మహిళా సంఘాలకు ప్రత్యేక రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రమీల రాణి

జి.సిగడాం : గ్రామాల్లో అర్హులైన మహిళా సంఘాలకు బ్యాంకు ద్వారా ప్రత్యేక రుణాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నామని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాన ప్రమీలరాణి అన్నారు. ఆదివారం ఎందువ గ్రామంలో మహిళా సంఘ సభ్యుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్వయం శక్తి సంఘాలు సకాలంలో రుణాలు చెల్లించాలన్నారు. కొత్త రుణాలను సద్వినియోగం చేసుకుని జీవనోపాధి పొందాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు వాన వెంకటరమణ పాల్గొన్నారు.

22 నుంచి శ్రీరామ వసంత నవరాత్రి ఉత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రోడ్డులోని ఉపనిషన్మందిరం ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి శ్రీరామ వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గుమ్మా నగేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి 29 వరకు రామాయణంలోని పలు అంశాలపై ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయని, ఏప్రిల్ 6న శ్రీరామదర్బారు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఉత్సాహంగా డ్రాయింగ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలో చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, బీఎంఎస్ పట్నాయక్, నిక్కు హరిసత్యనారాయణ, నటుకుల మోహన్, సాయిప్రసాద్, జోగిరాజు, ఎల్.దీప్తి పాల్గొన్నారు.

ఎండుచేపలకు వర్షాల దెబ్బ



పాడైన చేపలను పరిశీలిస్తున్నమత్స్యకారులు

రణస్థలం: మండలంలోని జీరుపాలెం, జగన్నాథపురం మత్స్యకార గ్రామాల్లో అకాల వర్షాలకు భారీగా నెత్తళ్లు (ఎండుచేపలు) నష్టపోయినట్లు మండల అసిస్టెంట్ మత్స్యశాఖ అధికారి కె.నాగరాజు తెలిపారు. జగన్నాథపురంలో తడిచిపోయిన చేపలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రూ.10 లక్షల విలువైన చేపలు నష్టపోయినట్లు వివరించారు. మత్స్యకారులు దుమ్ము నీలయ్య, అంబటి చిరంజీవి, దుమ్ము రత్నరాజు, అప్పన్న, బర్రి యర్రయ్య, వాసుపల్లి పోతయ్య, వంక నర్సింహులు, మాగుపల్లి రాముడు, బుజ్జి, రాముడులకు చెందిన చేపలకు నష్టం వాటిల్లిందన్నారు. కార్యక్రమంలో జీరుపాలెం గ్రామపెద్దలు, మత్స్యకారులు, సాగరమిత్ర సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

పాడి.. కాపాడితేనే రాబడి

- వేసవిలో పాడిపశువుల సంరక్షణ తప్పనిసరి
- నిర్లక్ష్యం చేస్తే నష్టం తప్పదు



పశువైద్యాధికారి, వి. రమణ

ఎచ్చెర్ల: పాడి పశువుల పెంపకంపై ఆధారపడిన రైతులకు ప్రభుత్వం అనేక పథకాల ద్వారా ప్రోత్సాహం అందిస్తోంది. గేదెలు, ఆవులకు ప్రమాదవశాత్తూ ఏదైనా జరిగినా తక్షణమే వైద్య సాయం అందించేందుకు వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే చాలు క్షణాల్లో పశువైద్యులు అంబులెన్స్ ద్వారా అక్కడికి చేరుకుని పశువుల ప్రాణాలు కాపాడుతున్నారు. ప్రస్తుతం వేసవి ఎండలు పెరుగుతున్న తరుణంలో రైతులు తగు జాగ్రత్తలు పాటిస్తే పాడి పశువులను వ్యాధులను కాపాడుకోవచ్చని ఎచ్చెర్ల మండల పశువైద్యాధికారి డాక్టర్ వి.రమణ సూచించారు. చలువ పందిళ్ల కింద పశువులను ఉంచడం వల్ల ఆరోగ్యంగా ఉంటాయని చెప్పారు. మరికొన్ని సూచనలు ఆయన మాటల్లోనే..

వ్యాధులతో జాగ్రత్త..

పశువులకు కొట్టం ఏర్పాటు చేసుకోవాలి. పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. కొట్టంలోకి గాలి, వెలుతురు బాగా ప్రవేశించేలా ఏర్పాటు చేసుకోవాలి. పరిశుభ్రమైన చల్లని నీరు పశువులకు అందుబాటులో ఉంచుకోవాలి. పచ్చని గడ్డి, ఎండుగడ్డి సమృద్ధిగా అందించాలి. సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించి అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధులకు కారణమయ్యే గోమార్లు, దోమలు, ఈగలను నిర్మూలించాలి. గేదెల పాకలు చల్లగా ఉండేలా చూసుకోవాలి. పశువుల పాక పైకప్పును గడ్డితో కప్పి నీళ్లు చల్లుతూ ఉండాలి. వీలైనంత వరకూ పాక పరిసరాల్లో చల్లటి నీడనిచ్చే కానుగ, బాదం, వేపచెట్లు పెంచుకోవాలి. రోజుకు రెండు మూడు సార్లు పశువులను చల్లటి నీటితో కడగాలి. వేసవిలో ఉదయం పది గంటలలోపు సాయింత్రం ఐదు గంటల పైన మాత్రమే మేత కోసం పశువులను బయటకు



ఎండలో మేస్తున్న పశువులు



పాకలో కట్టిన పశువులు

తోలాలి. ఎండ ఉన్న సమయంలో పశువులను మేతకు బయటకు పంపించకూడదు.

వడదెబ్బ లక్షణాలు..

వడదెబ్బ తగిలిన పశువుల్లో శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. చెమటలు ఎక్కువగా బయటకు రావటం, దాహం అధికంగా పెరగడం, మేత సరిగా మేయకపోవడం, శ్వాస కష్టంగా ఉండటం, ఎదకు సరిగా రాకపోవడం, గర్భస్రావం వంటి సమస్యలు తలెత్తుతాయి.

చికిత్స..

వడదెబ్బకు గురైన పశువులను గుర్తించి వెంటనే చికిత్స చేయించాలి. చల్లటి ప్రదేశాల్లో ఉంచి తేలికగా జీర్ణం అయ్యే దాణా, గంజిలో ఉప్పు కలిపి ఆహారంగా ఇవ్వాలి. వైద్యులను సంప్రదించి డెక్రోజ్ సైలైన్

ఎచ్చెర్ల నియోజకవర్గంలో పశువుల వివరాలు సుమారుగా..

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు
ఎచ్చెర్ల	16,800	120	12,940	3,942
జి.సిగడాం	12,920	420	18,420	2,940
లావేరు	12,340	392	34,200	6000
రణస్థలం	12,987	482	52340	4,500

ద్రావణాన్ని రక్తనాళంలోకి విటమిన్ ఏ, డీ సూదిమందులను విటమిన్ సీ, బీ కాంప్లెక్స్ సూదిమందులను వేయించాలి. రోజుకు 40 లీటర్ల నీటిని తాగించాలి.

పచ్చిమేతే రక్షణ

వేసవిలో పశువులకు పచ్చిమేత అందించాలి. పచ్చిగడ్డి పశువుల శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. పోషక విలువల కోసం ఖనిజ లవణ మిశ్రమం (మినరల్ మిక్సర్) వంటివి వాడాలి. పచ్చగడ్డి సదుపాయం లేని రైతులు పాతర వేసిన యూరియా గడ్డిన అందిస్తే ఫలితం ఉంటుంది. ఈ గడ్డిలో 45–55 శాతం వరకూ తేమ ఉంటుంది. శరీర ఉష్ణోగ్రత తగ్గి పాల దిగుబడి పెరిగే అవకాశం ఉంది. పశువుల పాక వద్ద పేడ, పెంటకుప్పల మీద వాలే దోమలు, ఈగల నివారణకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలి.

ఆదిత్యునికి విశేష పూజలు



ఆదిత్యుని జ్ఞాపిక అందుకుంటున్న ఎస్‌బీఐ డీజీఎం రంగరాజన్ దంపతులు



ఐఏఎస్ అధికారి జాఫర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో హరిసూర్యప్రకాష్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నప్పటికీ ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాల్లో సందడి కనిపించింది. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోగా, ఆరోగ్యం కోసం మరికొందరు సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. అంతరాలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. వర్షంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈవో వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సూర్యనారాయణ స్వామిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం కె.రంగరాజన్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. కేరళకు చెందిన కుడుంబశ్రీ మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్, ఐఏఎస్ అధికారి జాఫర్ మాలిక్ బృందం ఆదిత్యున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ప్రధానార్చకులు శంకరశర్మ గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఎస్‌బీఐ పీఆర్వో రామ్మూర్తి నాయుడు, కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఏపీ పోలీస్ మాజీ డీజీపీ నండూరి సాంబశివరావు కూడా ఆదిత్యున్ని దర్శించుకున్నారు.

దుర్గాదేవికి విశేష పూజలు

జి.సిగడాం: మండలంలోని గేదెలపేట, గంగన్నదొరపాలెం, జాడ, జి.సిగడాం గ్రామాల్లో ఆదివారం దుర్గాదేవి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నూకాలమ్మతల్లికి వెండి మకర తోరణం



మకరతోరణాన్ని సమర్పిస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో నూకాలమ్మతల్లి అమ్మవారికి ప్రముఖ వ్యాపారవేత్త, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బుర్రా వెంకటరావు దంపతులు సుమారు మూడున్నర కేజీల వెండి మకర తోరణాన్ని ఆదివారం గ్రామ పెద్దల సమక్షంలో సమర్పించారు. కార్యక్రమంలో శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా జిల్లా స్థాయి షటిల్ పోటీలు

నరసన్నపేట: స్థానిక జీసీ హోమ్ షటిల్ కోర్టులో జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్ పోటాపోటీ జరుగుతుంది. శ్రీమిత్రా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గనగళ్ల జగదీష్ మెమోరియల్ పేరున ఈ టోర్నీ ఫ్లెడ్‌లైట్స్ వెలుతురులో జరుగుతున్న విషయం విదితమే. 50 జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. ఆదివారం పలు జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. సోమవారం ఫైనల్ నిర్వహిస్తారు.

రామనామస్మరణతో ముక్తి

శ్రీకాకుళం కల్చరల్: రామనామ స్మరణ ముక్తికి సోపానమని వక్త నిష్టల నరసింహమూర్తి అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో ఆదివారం రామనామ మహత్యంపై ప్రసంగించారు. రామనామ స్మరణ చేసి గోపన్న, త్యాగయ్య, పోతయ్యలు మోక్షం పొందారని ఉదహరించారు. ముందుగా వక్తను మందిర సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసరావు, పతంజలి శాస్త్రి, కోమలరావు, ప్రసాద్, వెంకటరావు, తవుడు, బాబూరావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వక్తను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

ఎమ్మెల్సీ నర్తుకు ఘన స్వాగతం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): యాదవుల్ని గుర్తించిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికై సీఎంను కలిసిన అనంతరం ఆదివారం జిల్లాకు తొలిసారి విచ్చేసిన నర్తు రామారావుకు యాదవులంతా ఘన స్వాగతం పలికారు. పెద్దపాడు వద్ద అప్పన్నమ్మ తల్లి గుడి వద్ద ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా నర్తు మాట్లాడుతూ నామీదున్న అభిమానంతో ఎమ్మెల్సీగా ఎంపిక చేసేందుకు సహకరించిన అందరికి రుణపడి ఉంటానన్నారు. యాదవులంతా ఐక్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో నర్తు నరేంద్రయాదవ్, యాదవ సంఘ జిల్లా అధ్యక్షుడు గద్దిబోయిన కృష్ణయాదవ్, దాసరి రాము, నక్క రామన్న, కాల వెంకట్రావు, కయిత వెంకట్రావు, ఇప్పిలి అప్పారావు, వాయబోయిన హేమసుందర్, పాలిన గోపి, దలింగరావు, కలగ రఘురాం, కలగ లక్ష్మణ, బూర పాపారావు, కలగ లక్ష్మణరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ నర్తు రామారావుకు స్వాగతం పలుకుతున్న యాదవ కులస్తులు

కూన కథలు పుస్తకావిష్కరణ

శ్రీకాకుళం కల్చరల్: రాష్ట్ర భాషోపాధ్యాయులు, ప్రముఖ రచయిత కూన రంగనాయకులు రచించిన 'కూన కథలు' కథల సంపుటిని ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయం సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో తపస్వి పత్రిక సంపాదకులు నిమ్మగడ్డ కార్తీక్, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమారరాజు, కథా నిలయం కార్యదర్శి కాశీపట్నం సుబ్బారావు, ఈవేమన తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

బాల్ బ్యాడ్మింటన్ పోరులో సిక్కోలు అదుర్స్



బాడ్మింటన్ సంఘ ప్రతినిధులు, కోచ్ మేనేజర్లతో జిల్లా జూనియర్స్ బాలికల జట్టు సభ్యులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సిక్కోలు బాలికల బాల్ బ్యాడ్మింటన్ జట్టు చరిత్ర సృష్టించింది. జిల్లా చరిత్రలో జూనియర్స్ విభాగంలో బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తొలిసారి పతకం సాధించింది నెల్లూరు జిల్లా కావలిలోని డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణం వేదికగా ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు 7వ ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాల్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఇందులో శ్రీకాకుళం జిల్లా బాలికల జట్టు ఉత్తమ ప్రదర్శనను కనబర్చి తృతీయస్థానంలో నిలవడంతో సభ్యులంతా కాంస్య పతకాలు సాధించారు. ఈ మెగా టోర్నీలో నెల్లూరు, విజయనగరం, కడప, చిత్తూరు, పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాలను మట్టికరిపించిన జిల్లా బాలికల జట్టు సెమీఫైనల్స్‌లో మాత్రం ఒక్కపాయింట్ తేడాతో ఓడి ఫైనల్ బెర్త్‌ను కోల్పోయింది. సెమీస్‌లో విశాఖపట్నం జట్టుతో తలపడిన శ్రీకాకుళం జట్టు హోరాహోరీ పోరులో తుది వరకు పోరాడి ఒక్క పాయింట్ తేడాతో ఓటమిపాలైంది. దీంతో తృతీయస్థానం కోసం గుంటూరు జిల్లాతో జరిగిన మ్యాచ్‌లో ఘన విజయం సాధించి కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. జిల్లా జట్టు కోచ్ మేనేజర్లగా ఎం.మధుసూదనరావు, కోడి మోహనరావు వ్యవహరించారు. విజేతలకు ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వి. రమణ, జిల్లా డీఎస్ఏ సీఈఓ బి.వి.ప్రసాదరావు, చీఫ్ కోచ్ ఎం.మాధురీలత, ఎన్‌వైకే యూత్ కోఆర్డినేటర్ కె.వెంకట్ ఉజ్వల్, బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు బీహెచ్ అరుణకుమార్, పి.అజయ్‌కుమార్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

మొక్కజొన్న రైతుల్లో కలవరం

లావేరు: అకాల వర్షాలు మొక్కజొన్న రైతులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. లావేరు మండలం లావేటిపాలెం, లావేరు, కేశవరాయునిపురం, జీజీవలస, వెంకటాపురం, లింగాలవలస, పోతయ్యవలస, గోవిందపురం, భరిణికాం, ఇజ్జాడపాలెం, లుకలాపుపేట తదితర గ్రామాల్లో అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న పంట సాగు చేశారు. పంట చివరి దశకు చేరుకున్న తరుణంలో వర్షాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. కొంత మంది రైతులు పంటను కల్లాలకు తీసుకురాగా మరికొంతమంది పొలాల్లోనే ఉంచేశారు. నీరు నిల్వ ఉంటే మొలకలు వస్తాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. జి.సిగడాం మండలంలోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. పాలఖండ్యాం, మెట్టవలస, జి.సిగడాం, గేదెలపేట, బాతువ, సీతంపేట, నడిమివలస, జాడ, ముషినివలస, చంద్రయ్యపేట, వెలగాడ తదితర గ్రామాల్లో మొక్కజొన్న పంట తడిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



జి.సిగడాం: మొక్కజొన్న పంటను రక్షించుకుంటున్న రైతు



లావేరు: కేశవరాయునిపురంలో మొక్కజొన్న పంటను టార్పాలిన్‌తో కప్పిన దృశ్యం

గ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం'

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల /తో వార్తాపత్రికలు, కథలు పుస్తకాలు చదివించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి జి.నీలమ్మ మాట్లాడుతూ సెలవు రోజుల్లో గ్రంథాలయాన్ని విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందన్నారు. పోటీ పరీక్షల పుస్తకాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

- ఎచ్చెర్ల: పుస్తకాలు చదివితే మనసు ఆహ్లాదకరంగా ఉంటుందని గ్రంథాలయాధికారి ఎం.చంద్రశేఖరరావు అన్నారు. ధర్మవరం శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేధావుల జీవిత చరిత్రలను చదివి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కథలు చదివించారు. విజేతలుగా నిలిచి ఎస్.మనోజ్, జి.షణ్ముఖరావు, శరత్, వైకుంఠరావు, విజయభాస్కర్‌లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు బి.సూర్యనారాయణ, సూరిబాబు, మహేష్, జగదీష్, సురేష్, మధు, కిరణ్, నవీన్ పాల్గొన్నారు.
- లావేరు: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లావేరు లైబ్రేరియన్ మురపాక శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.
- శ్రీకాకుళం అర్బన్: పుస్తకం చదవడం ద్వారానే విద్యార్థులు విజ్ఞానం పెంపొందించుకోవచ్చని తెలుగు ఉపాధ్యాయుడు త్రినాథరావు అన్నారు. బలగ శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కథలు చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేన్, సహాయకురాలు కె.అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు



ధర్మవరం గ్రంథాలయంలో బహుమతులతో విద్యార్థులు



లావేరు గ్రంథాలయంలో కథలు చెబుతున్న విద్యార్థులు



బలగ గ్రంథాలయంలో కథలు వింటున్న విద్యార్థులు